సాక్షి గుంటూరు

సోమవారం । 1 । జూలై । 2024



సూర్యభగవానునికి పూజలు

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయం లోని సూర్యదేవాలయంలో ఆదివారం సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లక్ష్మీనారాయణ హోమం

నరసరావుపేట ఈస్ట్: గోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు.



అబ్బురపరిచిన ఆంధ్రనాట్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం విజయవాడకు చెందిన రాయన శ్రీనివాసరావు బృందం ప్రదర్శించిన ఆంధ్రనాట్యం అబ్బురపరిచింది.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో రాజశేఖరబాబు



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని ఆదివారం రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ రాజశేఖరబాబు దంపతులు దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ గోపినాథశర్మ, అర్చకులు రాజశేఖరబాబు దంపతులకు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం రాజశేఖర బాబు దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక



నరసరావుపేటఈస్ట్: పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో సబ్‌జూనియర్, జూనియర్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30మందికి పైగా క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. ఫ్రీస్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ తదితర అంశాలలో పోటీ నిర్వహించి 19మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జులై 13, 14 తేదీలలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్న 9వ సబ్‌జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు టి.అమర్‌నాథ్, రాఘవ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో యువకుడి గల్లంతు

కొల్లూరు: కృష్ణా నదిలోని లోతైన మడుగులో పడి ఓ యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం మండలంలోని జువ్వలపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. భట్టిప్రోలు మండలం అద్దేపల్లికి చెందిన గార్యాల అచ్చయ్య కుమారుడు కోటయ్య (26) హోటళ్లలో వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మిత్రుడు పుట్టినరోజు అవడంతో తోటి స్నేహితులతో కలసి జువ్వలపాలెం నదీ తీరానికి వెళ్లారు. మొత్తం ఎనిమిది మంది సరదాగా గడిపిన అనంతరం నదిలో నిలిపి ఉంచిన పడవను ఎక్కేందుకు ప్రయత్నించారు. ముగ్గురు యువకులు పడవ ఎక్కేందుకు ప్రయత్నించారు. ఇద్దరు పైకి చేరుకోగా, కోటయ్య ఎక్కుతున్న సమయంలో పడవ కదలడంతో ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అతడు పడిన ప్రాంతంలో లోతైన మడుగు ఉండటంతో నీట మునిగి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.00 అడుగుల వద్ద ఉంది. రోజా నుంచి శ్రీశైలం జలాశయానికి 403 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెనమలూరు: కానూరులోని కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో మహోత్సవాలు నిర్వహిస్తున్నామని రెవరెండ్ ఫాదర్ సలివేంద్రశౌరి అన్నారు. పుణ్యక్షేత్రంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. మహోత్సవాలు జూలై 7 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి నవ దినప్రార్థనలు, దివ్యబలి పూజలు జరుగుతాయని తెలిపారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్–2024 కౌన్సెలింగ్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ఏపీఈఏపీసెట్ దరఖాస్తు సమయంలోనే పూర్తి అయిన సర్టిఫికెట్ల పరిశీలన
- అసంపూర్తిగా ఉన్న విద్యార్థులకే హెల్ప్‌లైన్ కేంద్రాల్లో పరిశీలన
- ఈనెల 8వ తేదీన ప్రారంభం కానున్న వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు హెల్ప్‌లైన్ కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుబాటులో 22,290 సీట్లు



విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష(ఏపీ ఈఏపీసెట్–2024) కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఈమేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీ ఈఏపీ సెట్–2024 (ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించి, ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి ఎదురు చూస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది.

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

- ఏపీ ఈఏపీ సెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వెబ్ బేస్డ్ విధానంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పూర్తి చేసింది.
- ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యే 'నో యువర్ రిజిస్ట్రేషన్' పై క్లిక్ చేయాలి. తద్వారా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఏ స్థాయిలో ఉన్నదీ తెలుసుకోవచ్చు.
- ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తైయిన విద్యార్థులకు కంప్యూటర్ స్క్రీన్‌పై కేండెట్ ఈజ్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజింగ్ ఆప్షన్స్ అని కనిపిస్తే, విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధం కావచ్చు.
- ఈ విధంగా కాకుండా ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ హెల్ప్‌లైన్ కేంద్రంలో పురోగతిలో ఉన్న పక్షంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈజ్ అండర్ ప్రోగ్రెస్ అని కనిపిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో సీట్ల సంఖ్య ఇలా..

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లో రెండు ప్రభుత్వ, 38 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో బీటెక్ ప్రథమ సంవత్సరంలో 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 25వేలకు పైగా ఉన్నారు.

- ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు అసంపూర్తిగా ఉండటం, వివరాలు అసమగ్రంగా ఉన్న పరిస్థితుల్లో కాంటాక్ట్ హెల్ప్‌లైన్ సెంటర్(హెచ్ఎల్‌సీ) అని డిస్‌ప్లే అవుతుంది. ఈ విధంగా డిస్‌ప్లే అయితే ఆన్‌లైన్‌లో పొందుపర్చిన హెల్ప్‌లైన్ కేంద్రాల జాబితా నుంచి తమకు సమీపంలోని కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అనంతరం విద్యార్థులకు సంబంధించి అసమగ్రంగా ఉన్న సర్టిఫికెట్ల వివరాలు డిస్‌ప్లేలో ప్రత్యక్షమవుతాయి. సంబంధిత సర్టిఫికెట్లను విద్యార్థులు తిరిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత సంబంధిత హెచ్‌సీఎల్‌లో అధికారులు వాటిని పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుంది. అనంతరం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.
- గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో పాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఆయా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈనెల నాలుగు నుంచి 10వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తైయిన విద్యార్థులు ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. కోర్సులు జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. ఫోన్‌కు వచ్చే సమాచారం కూడా ముఖ్యమే కాబట్టి సెల్ నంబర్ విద్యార్థి లేదా తల్లిదండ్రుల నంబర్లు ఇవ్వాలి.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలయ్యే ప్రక్రియ

ఏపీ ఈఏపీసెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇందు కోసం ఏపీఈఏపీసెట్ హాల్ టికెట్, జనన తేదీ వివరాలను ఎంటర్ చేసి లాగిన్ కావాలి.

- ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజును తిరిగి ఇదే వెబ్‌సైట్‌లో క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ మార్గాల్లో చెల్లించాలి. ఏపీ ఈఏపీ సెట్ డీటైల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- 2,61,588 మందికి లబ్ధి
- రూ.174.42 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు

నెహ్రూనగర్: నూతన ప్రభుత్వం జూలై పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధం చేసింది. సాధ్యమైనంత వరకు ఒకటో తేదీనే వంద శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరైనా ఒకటో తేదీన పింఛన్లు తీసుకోలేకపోతే రెండో తేదీన విధిగా పంపిణీ చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలో 2,61,588 మంది పింఛన్ దారులకు రూ.174.41 కోట్లు మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. శనివారమే పింఛన్లకు సంబంధించిన నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసుకున్నారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచే పంపిణీని ప్రారంభించనున్నారు. 11 కేటగిరీల పింఛన్లకు ఏప్రిల్, మే, జూన్ బకాయి రూ.3000 కలపి జూలై పింఛను రూ.4 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయనున్నారు.

ప్రతి ఉద్యోగి 50 మందికి పంపిణీ..

గుంటూరు జిల్లాలో 5,232 మంది సచివాలయ సిబ్బంది చేత పింఛన్ల పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఒక్కొ సచివాలయ ఉద్యోగికి 50 మంది పెన్షనర్లను మ్యాపింగ్ చేసి ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోపు పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

- వికలాంగులు, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు(లెప్రసీ) ఇది వరకున్న పింఛను మొత్తం రూ.3 వేలను రూ.6 వేలకు పెంచి అందించనున్నారు.
- వీల్‌చైర్‌లు, బెడ్‌కు పరిమితమైన వికలాంగులు, ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి ఇది వరకు ఇస్తున్న రూ.5 వేల పింఛను రూ.15 వేలకు పెంచి అందజేయనున్నారు.
- కిడ్నీ, తలసీమియా, లివర్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్ పేషంట్లకు రూ.5 వేలు ఉన్న పింఛను మొత్తం రూ.10 వేలకు పెంచారు.
- సీకేడియూ డయాలసిస్ ప్రయివేటు, సీకేడీయు డయాలసిస్ ప్రభుత్వ ఆస్పత్రి, తలసీమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, తీవ్ర హెమోఫీలియా, సైనిక్ వెల్ఫేర్, అభయహస్తం పింఛన్లలో ఎలాంటి మార్పు లేదు. అదే విధంగా వీరందరికీ అరియర్స్ వర్తించదు.

డీఎల్‌ఈడీ ఫస్టియర్ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్

ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా

యడ్లపాడు: డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్‌ఈడీ) రెండేళ్ల కోర్సు ప్రవేశాలకు సంబంధించి ఫేజ్–2 వెబ్‌ఆప్షన్లు చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్ కళాశాల) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌కే సలీంబాషా కోరారు. డీఎల్‌ఈడీ ఫస్టియర్ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడించారు. డీఈఈ సెట్– 2024 అర్హత సాధించిన వారు డీఎల్‌ఈడీ 2024– 26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అర్హులన్నారు. బోయపాలెంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండేళ్ల డీఎడ్ కోర్సుకు మొత్తం 150 సీట్లు ఉన్నాయన్నారు. ఇవిగాక జిల్లాలోని ప్రైవేటు కళాశాలల్లోనూ చేరేందుకు అవకాశం ఉందని చెప్పారు. కోర్సులో చేరేందుకు అర్హత, ఆసక్తి కలిగిన వారు జూన్ 30వ తేదీ నుంచి వెబ్‌ఆప్షన్ ఎంపిక చేసుకోవాలని కోరారు. వెబ్‌ఆప్షన్లకు జులై 4వ తేదీ చివరి గడువు అన్నారు. 5 నుంచి 7వ తేదీ వరకు సీట్లు కేటాయింపు 8న ప్రొవిజన్ లెటర్లు మంజూరు, 9 నుంచి 13వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ బోయపాలెం డైట్ కళాశాలలోనే నిర్వహించి, వెంటనే అడ్మిషన్ లెటర్లు పొందవచ్చన్నారు. 15న తమకు కేటాయించిన కళాశాలల్లో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది.



బోయపాలెంలోని ప్రభుత్వ డైట్ కళాశాల

ఆషాఢ మాసోత్సవాలకు ఏర్పాట్లు

- 6 నుంచి వారాహి నవరాత్రులు
- 19 నుంచి మూడు రోజులు శాకంబరీదేవీ ఉత్సవాలు
- దుర్గగుడి ఈఓ రామరావు



మాట్లాడుతున్న ఈఓ రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం నెల రోజుల్లో జరిగే విశేష పర్వదినాలు, పండుగలు, ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ కె.ఎస్.రామరావు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఆదివారం దేవస్థాన అధికారులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రామరావు, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు లింగంబోట్ల బద్రీనాథ్‌బాబు ఆషాఢ ఉత్సవాల విశేషాలను వివరించారు. సమావేశంలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కోటేశ్వరరావు, లింగం రమాదేవి, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి, ఏఈఓ ఎన్.రమేష్‌బాబులు పాల్గొన్నారు.

6 నుంచి ఆషాఢ మాసోత్సవాలు

ఈ నెల ఆరో తేదీ నుంచి ఆగస్టు నాలుగు వరకు అమ్మవారి సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. తొలి రోజు 6వ తేదీ దేవస్థాన అర్చకులు అమ్మవారికి సారె సమర్పించడం ద్వారా ఉత్సవాలను ప్రారంభిస్తారని, మహామండపం ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహిస్తారన్నారు. సారె సమర్పించడానికి వచ్చే భక్తులు, దేవస్థాన కమిటీలకు స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

6 నుంచి 15 వరకు వారాహి నవరాత్రులు

దుర్గగుడిలో ఈ ఏడాది వారాహి నవరాత్రులను నిర్వహించాలని వైదిక కమిటీ సూచించిందన్నారు. 6వ తేదీ ఉదయం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద కలశస్థాపన, పూజా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అంతరాలయంలో అమ్మవారి మూల విరాట్ వద్ద పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులచే నిర్వహించడం జరుగుతుందన్నారు. కాలమానం ప్రకారం చైత్రమాసం వసంత నవరాత్రులు, ఆషాఢంలో వారాహి నవరాత్రులు, అశ్వయుజం మాసంలో దేవి శరన్నవరాత్రులు, మాఘమాసంలో శ్యామలా నవరాత్రులు జరుగుతాయని, ఆయా కాలాలకు అనుగుణంగా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారన్నారు.

14న తెలంగాణ బోనాలు

ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు హైదరాబాద్‌లోని మహంకాళి జాతర బోనాల కమిటీతో బంగారు బోనం సమర్పిస్తారన్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించడానికి హైదరాబాద్ నుంచి వెయ్యి మందికి పైగా కళాకారులు తరలిరానున్నారన్నారు. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుందని చెప్పారు.

19 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు

ఆషాఢ శుద్ధ త్రయోదశి 19వ తేదీ నుంచి ఆషాఢ శుద్ధ పౌర్ణమి 21వ తేదీ వరకు అమ్మవారి సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలను నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భూలోకంలో వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికిఏటా శాకంబరీదేవి ఉత్సవాలను చేస్తున్నామని చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో ఒక్కో రోజు ఆకు కూరలు, కాయగూరలు, పండ్లతో అమ్మవారికి విశేషంగా అలంకరిస్తారన్నారు. అలంకరించిన కాయగూరలు, ఆకుకూరలతో కదంబం ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తారన్నారు. 21వ తేదీ ఉదయం మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయన్నారు.19, 20వ తేదీలలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వద్దిపర్తి పద్మాకర్‌తో శ్రీకనకదుర్గ దేవి మహిమలపై ఆధ్యాత్మిక ప్రవచనం జరుగుతుందన్నారు. తెలంగాణా బోనాలను పురస్కరించుకుని దుర్గమ్మ తరుపున 28వ తేదీ దేవస్థానం నుంచి ముఖ్య అధికారులతో పాటు ప్రభుత్వం తరపున ఆయా దేవాలయాల్లో కొలువు తీరిన అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారని తెలిపారు.

భారం మోస్తున్న బాల్యం!

- అమలుకాని ఎన్‌సీఈఆర్‌టీ సూచనలు
- విద్యార్థులకు తప్పని పుస్తకాల భారం
- చిన్నారులకు ఆరోగ్య సమస్యలు
- బరువుపై 2017లోనే ప్రత్యేక జీఓ

ఓ చిన్నారి కొత్తగా స్కూల్‌లో చేరింది. కొత్త బ్యాగులో.. పుస్తకాలు.. భోజనం బాక్స్.. వాటర్ బాటిల్‌తో స్కూల్‌కు వెళ్తోంది. స్కూల్‌కు వెళ్తున్న ఆనందం ఎన్నో రోజులు లేవు.. కొద్ది రోజుల్లోనే మెడ నొప్పితో బాధపడటాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. వైద్యున్ని సంప్రదించారు. స్కూల్ బ్యాగు భారంగా గుర్తించి తగ్గించేందుకు సలహా ఇచ్చారు. ఇలా తల్లిదండ్రులకు తెలియకుండానే విద్యార్థులపై భారం పడుతోంది.

సత్తెనపల్లి: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాల సంచి భారంగా మారుతోంది. దీంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నది వైద్యుల మాట. ఈ పరిస్థితిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేసిన సూచనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఏటా పుస్తకాల సంచిలో బరువు పెరగడమే తప్ప ... తగ్గడం కనిపించడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది.

తగ్గని బరువు...

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు(లాంగ్వేజెస్, గణితం), మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కేవలం మూడు పుస్తకాలు(లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) పిల్లలపై ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తుంది. అయితే ప్రస్తుతం ఒకటి రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తర్వాత పెరిగే కొద్దీ అధిక పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి చెప్పనక్కర్లేదు.



ఆరోగ్య సమస్యలు ఇవే...

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలు రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారితీస్తుందని పేర్కొంటున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఏర్పడవచ్చంటున్నారు. చదువులపై ఏకాగ్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినడమే కాకుండా తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ జీఓ ఇలా..

విద్యార్థుల బడి సంచి బరువుపై రాష్ట్ర ప్రభుత్వం 2017లో జీఓ నంబర్ 22 విడుదల చేసింది. దాని ప్రకారం తరగతుల వారీగా బ్యాగు బరువు ఇలా ఉండాలని సూచించింది.

తరగతి	బరువు(కిలోలు)
1-2	1.50
3-5	2-3
6-7	4
8-9	4-5
10	5

ఇదీ ఎన్‌సీఈఆర్‌టీ పరిశీలన...

బడిసంచి బరువుపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వ హించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీల పుస్తకాల మోత ఉంటుంది. 8 నుంచి 10వ తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగునీటి బాటిల్స్ తదితరాలు అదనం. ప్రభుత్వ బడులు కన్నా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల మోత ఎక్కువగా ఉంటుందని శిక్షణ మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐబిటీ, సీబీఎస్ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

ఆరోగ్యంపై దుష్ప్రభావం



విద్యార్థులు తమ సామర్థ్యానికి మించి పుస్తకాల సంచిని మోయడం మంచిది కాదు. మానసికంగా బలహీనత, నడుము, వెన్నుపూస, కండరాల నొప్పులు బాధిస్తాయి. తద్వారా పిల్లలు చదువుపై దృష్టి పెట్టలేరు. పుస్తకాల సంచి బరువును తగ్గించే ప్రయత్నాలు కచ్చితంగా చేయాలి. అప్పుడే ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారు. చక్కటి విద్యాభ్యాసం చేస్తారు.

–డాక్టర్ బి.లక్ష్మణరావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల తాకిడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వర్షంలోనూ భక్తుల రద్దీ కనిపించడంలో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించని పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గ మాలార్చన, ఉదయం నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కళ్యాణంతో పాటు సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవకు డిమాండ్ కనిపించింది. మరో వైపున దేవస్థాన ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ.100, రూ.300, రూ.500 వీఐపీ దర్శనం క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ నేపథ్యంలో భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు.

ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన

లోక సంరక్షనార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

పోలీసులకు అవగాహన సదస్సులో ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: నూతన చట్టాలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గుంటూరు రేంజ్ పోలీస్ అధికారులకు నూతన చట్టాలపై ఆదివారం ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్‌లు ప్రత్యేక చొరవ తీసుకొని గుంటూరు రేంజ్ పరిధిలోని పోలీస్ అధికారులకు జూలై ఒకటి నుంచి అమల్లోకి రానున్న నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నూతన చట్టాలపై అధ్యయనం చేసిన నిష్ణాతులు, ఐపీఎస్ అధికారులకు శిక్షణనిచ్చే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఈ.దామోదర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన చట్టాల గురించి పోలీస్ అధికారులకు క్లుప్తంగా వివరించి, వారి సందేహాల్ని నివృత్తి చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గత చట్టాల్లోని లోపాల్ని సవరించి, ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా పటిష్టంగా నూతన చట్టాల్ని ప్రభుత్వం రూపొందించినట్లు చెప్పారు. జూలై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్న భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాల గురించి వివరించారు. పాత, కొత్త చట్టాల మధ్య వ్యత్యాసాలు గురించి పోలీస్ అధికారులకు క్లుప్తంగా వివరించారు. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యాల చట్టం (ఐఈఏ) స్థానంలో భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాలు సోమవారం నుంచి అమలు కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బెదిరిస్తే భూములు ఇచ్చేదే లేదు!

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



ఉండవల్లిలో రైతులతో సమావేశమైన రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రైతులను బెదిరించి భూములు లాక్కోవాలని ప్రయత్నిస్తే భూములు ఇచ్చేదే లేదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య స్పష్టం చేశారు. రైతుల వద్ద నుంచి ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణకు భూముల సేకరణ నేపథ్యంలో ఆదివారం ఉండవల్లిలోని ఈశ్వర్‌రెడ్డి ఇంటి వద్ద జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ కోసం రైతుల వద్ద నుంచి భూములు సేకరించే అంశంపై స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ వద్దకు వెళ్లి అభిప్రాయాలను తెలియజేసి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తద్వారా సమస్య పరిష్కారం అవుతుందని సూచించారు. రైతు సంఘం ఉపాధ్యక్షులు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ సీడ్‌యాక్సెస్ రోడ్డు విస్తరణ చేయడానికి రైతు దగ్గర నుంచి భూములను సీఆర్‌డీఏ అడుగుతున్న నేపథ్యంలో భూములిచ్చిన రైతులకు ఎన్ని గజాలు ఇస్తారు? డెవలప్ చేసిన దాన్ని ఇవ్వడానికి ఎన్ని గజాలు మాకు ఇస్తారు? అనే వివరాలు సీఆర్‌డీఏ సమావేశం ద్వారా రైతులకు తెలియజేయాలన్నారు. గతంలో జరిగిన పరిణామాలను సమావేశంలో వివరించారు. మనం వెనకడుగు వేయాల్సిన పనిలేదని, మనకు చట్టాలు అండగా ఉంటాయన్నారు. సమావేశంలో సీడ్ యాక్సెస్ రోడ్డు కింద పోయే రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మనకు ప్యాకేజీ పెంచి ఇవ్వాలని అలా జరగని పక్షంలో భూమికి భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. తామంతా రాజధాని అభివృద్ధికి సమ్మతమేనని, మా వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తామని వారంతా వెల్లడించారు. అయితే మమ్మల్ని బెదిరించి భూములు లాక్కోవడానికి మీరు ప్రయత్నం చేస్తే తాము వాటిని ఇవ్వమని వెల్లడించారు.

ఇదే విషయాన్ని సమావేశంలో తీర్మానం చేశారు. దీనికి చట్టపరమైన అవగాహన కోసం లాయర్‌లు శ్రీనివాసరావు, వాసు తగిన సలహాలు ఇచ్చారు. ఈ సమావేశానికి కలం సాంబిరెడ్డి, బుర్రముక్కు పద్మారెడ్డి, పి.వీరాస్వామి, జొన్న నాగిరెడ్డి, షేక్ ఎర్ర, పేరు గణేష్, సుమారు 60 మంది రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయించవద్దు

- గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు
- అనుమతి పొందిన బయో మందులే విక్రయించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు
- ధరలు, నిల్వలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): వ్యవసాయ శాఖ జారీచేసే లైసెన్స్ లేకుండా ఉమ్మడి జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించవద్దని గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో వ్యాపారులకు తెలిపారు. 2024–25 సీజన్‌కు సంబంధించి వ్యాపారస్తులు వ్యాపార నిర్వహణ బాధ్యతలను తప్పనిసరిగా పాటించాలన్నారు. విక్రయ లైసెన్స్‌లను అమ్మకాల కేంద్రాల్లో, గిడ్డంగుల్లో కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. అమ్మకాల కేంద్రాలకు వచ్చిన నిల్వలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేశాక అమ్మకాలు ప్రారంభించాలన్నారు. అంతేగాక విక్రయాలకు సిద్ధం చేసిన విత్తన నిల్వలకు సంబంధించి సోర్స్ ఆఫ్ సప్లయి ధృవీకరణ పత్రాలను సంబంధిత ఉత్పత్తిదారుల నుంచి లేదా, పంపిణీదారుల నుంచి పొందాలని చెప్పారు. అమ్మకాలకు ఉంచిన పురుగు మందుల నిల్వలకు సంబంధించిన ప్రిన్సిపల్ ధృవీకరణ పత్రాలు డీలర్ల వద్ద విధిగా ఉండాలని, ఎరువుల నిల్వలకు విధిగా 0–ఫారం జత చేయాలని పేర్కొన్నారు. జి–1, జి–2, జి–3 అనుమతి పొందిన బయో మందులనే విక్రయించాలని చెప్పారు. విక్రయాల కేంద్రాల్లో నిల్వలు, ధరలను సూచించే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ఆయా బోర్డులను ప్రతిరోజు సరిచూసుకోవాలని తెలిపారు. డీలర్లు డిమాండ్ ఉన్న రకాలకు కృత్రిమ కొరత సృష్టించవద్దని స్పష్టం చేశారు. డీలర్లు డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలన్నారు. స్టాక్ సంచులు, బస్తాలపై గరిష్ట అమ్మకాల ధరలకు మించి విక్రయించొద్దని సూచించారు. రైతులు అడిగిన వాటిని మాత్రమే సరఫరా చేయాలని, ఎవరైనా రైతులను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు యివ్వాలని వ్యాపారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలోని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలతోపాటు, వారి లైసెన్స్‌ల రద్దు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు సిఫార్స్ చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

సీపెట్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్–టెక్నాలజీ (సీపెట్)లో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వ్యవధి గల డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీఎంటీ), డిప్లమా ఇన్‌ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ)లలో ప్రవేశానికై ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి, ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రీ–యింబర్స్‌మెంట్ సదుపాయంతో పరిమిత సంఖ్యలో ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఆసక్తి గల విద్యార్థులు సంప్రదించాలని తెలిపారు. ఆయా కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు ప్లాస్టిక్స్ రంగంలో బహుళజాతి సంస్థల్లో జూనియర్ ఇంజినీర్, మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింట్‌నెన్స్) వంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, ప్రారంభ వేతనం రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 78935 86494 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

‘రైతు సేవా కేంద్రాలు’గా మారిన ఆర్బీకేలు

సమూల మార్పులు చేపట్టిన ప్రభుత్వం

కొరిటెపాడు(గుంటూరు): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పేర్లను టీడీపీ కూటమి ప్రభుత్వం సమూలంగా మార్పు చేసింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖలన్నీ గ్రామస్థాయిలోనే రైతులకు అందుతున్నాయి. ఆర్‌బీకే వ్యవస్థ జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకుంది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఇక నుంచి రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. ఆర్‌బీకే, డిజిటల్ కియోస్క్ సాఫ్ట్‌వేర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో, నవరత్నాలు, ఆర్‌బీకే లోగోను వెంటనే తొలగించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా, మండల, ఆర్‌బీకే స్థాయిలో ఉన్న వ్యవసాయ సలహా మండళ్లను రద్దు చేసింది. ఆర్‌బీకే చానల్ స్టూడియో పేరు పాడిపంటలు చానల్ స్టూడియోగా మార్పు చేసింది. డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా మ్యాగజైన్ పేరును పాడిపంటల మ్యాగజైన్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

నవులూరులో భారీ చోరీ

280 గ్రాముల బంగారం, రూ.30 వేలు నగదు చోరీ

మంగళగిరి: స్థానిక నవులూరులో భారీ చోరీ వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కొడాలి సతీష్ కుమార్ కుటుంబంతో పాటు మరో రెండు కుటుంబాలు తమ బంగారాన్ని సతీష్‌కుమార్ నివాసంలో ఉంచి ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లారు. ఈ నెల 27వ తేదీన వారంతా తిరిగిరాగా సతీష్ కుమార్ దంపతులు విజయవాడలోని తమ కుటుంబ సభ్యుల నివాసానికి వెళ్లారు. ప్రతిరోజు ఇతరులు సతీష్‌కుమార్ నివాసం తాళాలు చూసి సమాచారమిచ్చేవారు. ఆదివారం ఉదయం ఇంటి తాళాలు తీసి ఉండడంతో పక్కింటి వారు సతీష్ కుమార్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వగా నివాసానికి చేరుకున్న సతీష్‌కుమార్ బంగారం నగదు చోరీకి గురైందంటూ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 20 లక్షల విలువైన 280 గ్రాముల బంగారంతో పాటు రూ 30 వేలు నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డయేరియాను అశ్రద్ధ చేయవద్దు

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ కొర్రా విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఈ రెండు నెలలు పాటు ప్రతి ఇంటిని సందర్శించాలని కోరారు. అప్పుడే పుట్టిన పసికందు మొదలుకొని ఐదేళ్ల పిల్లలు ఉన్న ఇళ్లలో ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందించాలని చెప్పారు. విరోచనాలు మొదలైన వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తాగించి, రెండు నుంచి ఆరు నెలల శిశువులకు జింక్ అరమాత్ర ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల నుంచి ఐదేళ్ల పిల్లలకు ఒక జింక్ మాత్ర ఇవ్వాలన్నారు. ఓఆర్ఎస్ తాగించడం వలన నీళ్ల విరోచనాల ద్వారా శరీరం కోల్పోయిన నీటిని, ఖనిజ లవణాలను పొందవచ్చని వెల్లడించారు. జింక్ మాత్ర రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుందని వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ని ఒక లీటరు పరిశుభ్రమైన నీళ్లలో పూర్తిగా కలిపి 24 గంటల లోపల ఉపయోగించాలని, మిగిలిన నీటిని పారబోయాలన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని పిల్లల్లో విరోచనాల వలన కలిగే ప్రాణ నష్టాన్ని ఆపుదాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని డీఎంహెచ్ఓ వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

- గుంటూరు పశ్చిమలో 113.2 మి.మీ వర్షం
- సగటున 60.5 మి.మీ వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 113.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 32.4 మి.మీ వర్షం పడింది. సగటున 60.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 95.4 మి.మీ., గుంటూరు తూర్పు 80.4, వట్టిచెరుకూరు 78.2, చేబ్రోలు 77, ఫిరంగిపురం 66.2, మంగళగిరి 61.6, పెదకాకాని 59.2, తాడికొండ 56.4, తుళ్ళూరు 52.4, పొన్నూరు 51.4, మేడికొండూరు 49.4, తెనాలి 49, తాడేపల్లి 48.6, కొల్లిపర 40.4, కాకుమాను 39.8, దుగ్గిరాల మండలంలో 37.8 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ మాసం చివరి నాటికి జిల్లా సగటు వర్షపాతం 97.1 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, 171.1 మి.మీ వర్షపాతం నమోదైంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలం పనులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

న్యూరోసర్జన్ డాక్టర్ అరుణ్ కుమార్‌కు పురస్కారం



డాక్టర్ అరుణ్‌కుమార్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ అరుణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన న్యూరో, స్పైయిన్ సర్జన్ డాక్టర్ పద్మనాభుని అరుణ్ కుమార్‌కు ఆదివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్సిపరేషన్ అవార్డు 2024 లభించింది. టాప్ నాచ్ ఫౌండేషన్ అనే సంస్థ హెల్త్ కేర్ రంగంలో ప్రత్యేక నైపుణ్యం కనబరిచిన వ్యక్తులను ఎంపిక చేసి ఈ అవార్డును అందజేస్తుంది. ఈ పురస్కారానికి దేశవ్యాప్తంగా 1200 మంది ఎంపిక అవ్వగా అందులో టాప్ నాచ్ ఫౌండేషన్ 58 మంది ఎంపిక చేశారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ అరుణ్ కుమార్ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అరుణ్ కుమార్ కోవిడ్ సమయంలో అందించిన సేవలకు, అత్యవసర సమయంలో క్లిష్టమైన ఆపరేషన్, రోగుల అభిప్రాయాలను సేకరించి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. డాక్టర్ అరుణ్‌కుమార్ ఆర్మడ్ ఫోర్స్ మెడికల్ కాలేజ్ పూణేలో నూరోసర్జరీలో పీజీ పూర్తి చేసి రమేష్ హాస్పిటల్స్‌లో ఏడేళ్లుగా 9000 ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. న్యూఢిల్లీ రాజ్ భవన్‌లో అవార్డు మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ ఆఫ్ కోల్ అండ్ మైన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సతీష్ చంద్ర దుబే, బాలీవుడ్ యాక్టర్, ఎంపీ, హేమామాలిని చేతుల మీదుగా డాక్టర్ అరుణ్ కుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన




జూమ్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

నగరంపాలెం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని హాల్‌లో నూతన చట్టాలపై ఆదివారం పోలీస్ అధికార, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్), భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బి.ఎస్.ఎ) చట్టాలపై, పాత, కొత్త చట్టాల మధ్య తేడాలపై జూమ్ ద్వారా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇ.దామోదర్ వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కొత్త చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సీఐ మౌలాష రిఫ్ పాల్గొన్నారు.

హాయ్‌ల్యాండ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

మంగళగిరి: స్థానిక చినకాకాని హాయ్‌ల్యాండ్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని ఆదివారం పోలీసులు కనుకొన్నారు. రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ వివరాల మేరకు చినకాకాని హాయల్యాండ్ రోడ్డులోని గోడౌన్ వద్ద ఓ మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుడు టీషర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు.

రచయిత్రి సునీతకు పురస్కారం



బల్లికురవ: మహనీయులు అంబేడ్కర్, గుర్రం జాషువా, పూలే కలలు కన్న సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కవయిత్రి రచయిత గంగవరపు సునీత అన్నారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఆమె 2018 నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సాహిత్య సేవా రత్నతోపాటు ఎన్నో పురస్కారాల్ని అందుకున్నారు. మరో గబ్బిలం ఖండ కావ్యం ద్వారా నెల్లూరు విశాలాక్షి 15 వార్షికోత్సవ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం నెల్లూరులోని ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, రచయిత్రి శీలా సుభద్రాదేవి ద్వారా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పుస్తక వ్యవస్థాపకుడు కోసూరి రత్నం, సంపాదకులు ఈతకోటి సుబ్బారావు పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న సునీతను ఎంఈవోలు వస్తం నాయక్, రమేశ్‌బాబు, హెచ్ఎం కె.హనుమంతరావు, పీఎంసీ చైర్మన్ నార్నె శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

షెడ్డు కూలి కోళ్లు మృతి



మృతి చెందిన కోళ్లు

గుంటూరు రూరల్: ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోళ్ల ఫారం షెడ్డు కూలి భారీగా కోళ్లు మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన తోట సుబ్బారావు కోయవారిపాలెం గ్రామంలో కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తూ జీవిస్తుంటాడు. శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోళ్ల ఫారం షెడ్లు కూలిపోయాయి. దీంతో ఫారంలో ఉన్న కోళ్లు వర్షానికి తడిచి షెడ్ల కిందపడి మృత్యువాతకు గురయ్యాయి. ఘటనలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పోలీస్ శాఖలో పని చేయడం అదృష్టం

బాపట్ల టౌన్: పోలీస్ శాఖలో పని చేయడం అదృష్టమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నాలుగు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ పి. శ్యామలాదేవి, బాపట్ల జిల్లా ఎస్‌బీ విభాగం ఎస్ఐ ఐ.మస్తానయ్య, బాపట్ల జిల్లా కమ్యూనికేషన్ ఎస్ఐ బి.రాజమణి , కొల్లూరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ షేక్ కరీముల్లా, చీరాల– 1టౌన్ హోంగార్డ్ కె. కోటేశ్వరరావును ఆదివారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాస్‌రెడ్డి, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ పాల్గొన్నారు.